సాక్షి
కాకినాడ

బుధవారం । 22 । జనవరి । 2025



తగ్గనున్న టెన్షన్

పదో తరగతి పరీక్షలు అనగానే ఎక్కడ లేని హడావుడి ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు పరీక్షల విభాగం పలు మార్పులు చేపట్టింది.


8లో



నేటి నుంచి జేఈఈ మెయిన్స్

జేఈఈ మెయిన్స్ పరీక్షలను తూర్పు గోదావరి జిల్లాలో బుధవారం నుంచి 30వ తేదీ వరకూ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.

డెల్టాలకు 9,745 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులకు చేరింది.

గురువులు లేక.. చదువులు బరువు



పిఠాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- డిగ్రీ కళాశాలల్లో కోర్సులు ఫుల్
- అధ్యాపకులు నిల్
- దాదాపు సగం పోస్టులు ఖాళీ
- బోధించే వారు లేక విద్యార్థులకు అవస్థలు

పిఠాపురం: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా తయారైంది కూటమి ప్రభుత్వ విద్యా విధానం. కొత్త కొత్త కోర్సులు హడావుడిగా ప్రారంభించేస్తున్న అధికారులు.. దానికి తగినట్లుగా బోధనా సిబ్బందిని నియమించడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఫలితంగా చదువు చెప్పే వారు లేక కళాశాలకు ఎందుకు వస్తున్నామో తెలియని అయోమయ పరిస్థితుల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో కాకినాడ, పిఠాపురం, పెరుమాళ్లపురం, తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, పెద్దాపురం ఎంఆర్ కాలేజీ, ఎంఎస్ఎన్ చారిటీస్ తదితర డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిలో సుమారు 7 వేల మంది విద్యార్థులు వివిధ కోర్సులు చదువుకుంటున్నారు. ఈ కళాశాలల్లో బీఏ ఆనర్స్ ఎకనామిక్స్, బీకాం ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ జువాలజీ తదితర గ్రూపులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా అధ్యాపకులు లేకపోవడంతో డిగ్రీ కళాశాలల్లో బోధన కుంటుపడుతోంది. మామూలు కోర్సులను అరకొరగా ఉన్న సిబ్బందితో నిర్వహిస్తుండగా.. కంప్యూటర్ కోర్సులకు అసలు అధ్యాపకులే లేని దుస్థితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. పోస్టుల భర్తీపై ప్రభుత్వానికి పలుమార్లు నివేదికలు పంపినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సగం పోస్టులు ఖాళీ

నియోజకవర్గ కేంద్రమైన పిఠాపురంలో ఎన్నో సంవత్సరాలుగా డిగ్రీ కళాశాల లేక స్థానిక ఈ ప్రాంత విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో 2008లో పిఠాపురానికి డిగ్రీ కళాశాలను నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన హఠాన్మరణానంతరం వచ్చిన పాలకులు ఈ కళాశాల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ డిగ్రీ కళాశాల నిర్మాణానికి ఓఎన్జీసీ సహకారంతో రూ.1.5 కోట్లు కేటాయించారు. 2021 అక్టోబర్ 5న కళాశాల నిర్మాణానికి అప్పటి మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తి కావడంతో ఇటీవల కొత్త భవనంలో తరగతులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ 3 వేల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. పెద్దదైన ఈ కళాశాలలో అనేక రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇలాకాలో ఉన్న ఈ కళాశాలలో 100 మందికి పైగా అధ్యాపకులు ఉండాలి. కానీ, ప్రస్తుతం సుమారు 50 మంది మాత్రమే ఉన్నారు. ఉదాహరణకు బీకాం ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్ కోర్సులకు ముగ్గురు అధ్యాపకులు ఉండాలి. కానీ, ఒక్కరు కూడా లేక ఫ్యాకల్టీలతో చదువు చెప్పించాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాగే, ఇతర సబ్జెక్టులకు కూడా అవసరమైన స్థాయిలో అధ్యాపకులు లేరు. పోస్టుల భర్తీని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటి వరకూ సొంత భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులు.. ఇప్పుడు చదువు చెప్పే వారు లేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	6
ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు	3
విద్యార్థులు	7,000
కంప్యూటర్ కోర్సు చదువుతున్న వారు	1,500
మొత్తం అధ్యాపక పోస్టులు	సుమారు 220
ఖాళీలు	సుమారు 85

లెక్చరర్లను నియమించాలి

ఇప్పటి వరకూ ఒక్క పూటే తరగతులు నిర్వహించడం వల్ల ఉదయాన్నే ఉరుకులు పరుగులుగా కళాశాలకు రావాల్సి వచ్చేది. క్లాసులు అంతంత మాత్రంగానే జరిగేవి. సౌకర్యాలు లేక చాలా ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం కళాశాల నూతన భవనం ప్రారంభం కావడం.. కొత్త తరగతి గదులు అందుబాటులోకి రావడంతో చాలా ఆనందపడ్డాం. కానీ కంప్యూటర్ కోర్సులకు లెక్చరర్లు లేక ఇబ్బందిగా ఉంది. వెంటనే లెక్చరర్లను నియమించాలి.

– వి.సత్య, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, డిగ్రీ కాలేజీ, పిఠాపురం

ప్రభుత్వానికి నివేదిక పంపించాం



నూతన కళాశాల భవనం అందుబాటులోకి వచ్చింది. పూర్తి స్థాయిలో క్లాసులు ప్రారంభించాం. కళాశాలలో సుమారు 130 మంది కంప్యూటర్ కోర్సులు చదువుతున్నారు. కానీ, అధ్యాపకులు లేక ఫ్యాకల్టీలతో విద్యా బోధన చేయిస్తున్నాం. అధ్యాపకులను నియమించాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలోనే పోస్టులు మంజూరు చేస్తారని భావిస్తున్నాం.

– డాక్టర్ పి.సుభాషిణి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పిఠాపురం

విద్యా సంస్థలపై ప్రభుత్వం నిర్లక్ష్యం



విద్యా సంస్థలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ విద్యా విధానాలున్నాయి. నూతన విద్యా విధానం అమలు సక్రమంగా జరగడం లేదు. కంప్యూటర్ కోర్సులు నిర్వహిస్తున్న కాలేజీల్లో అధ్యాపకులు లేకపోవడం సిగ్గుచేటు. మామూలు కోర్సులైతే పుస్తకాలు చదివి నేర్చుకునే అవకాశం ఉంది. కంప్యూటర్ కోర్సులు బోధించే వారు లేకుండా విద్యార్థులు ఎలా నేర్చుకుంటారు? ఎలా పరీక్షలు రాయగలుగుతారు? ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీనిపై ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నాం.

– ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ

న్యూస్‌రీల్

డ్రైవింగ్‌లో బాధ్యతగా ఉండాలి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రతి ఒక్కరూ వాహనాల డ్రైవింగ్ సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా రవాణా అధికారి కె.శ్రీధర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రహదారి భద్రత ప్రచారం – శ్రద్ధ వహించండి అనే అంశంపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపరాదని, రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ప్రతి రోజూ ఒక అంశంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ జీవీ శివారెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న నేతలు, అధికారులు

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, మరింత మందికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు కృషి చేయాలని స్థానిక ఎంపీ, జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) చైర్మన్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన దిశ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కలెక్టర్, దిశ మెంబర్ సెక్రటరీ షణ్మోహన్ మాట్లాడుతూ, పీఎంఈజీపీ, పీఎంఎంవై, ముద్రా వంటి పథకాలు, జాతీయ ఆరోగ్య పథకం, జననీ సురక్ష యోజన, ప్రధాన మంత్రి మాతృత్వ వందన, సార్వత్రిక ఆరోగ్య పరీక్షలు, రాష్ట్రీయ బాల స్వాస్థ్య, రక్తహీనత నిర్మూలన తదితర వివిధ పథకాల గురించి వివరించారు. సమావేశంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన, జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఆధ్యాత్మికతను అలవరచుకోవాలి



భక్తులకు దీవెనలు అందజేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

పిఠాపురం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరచుకోవాలని మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. స్థానిక శ్రీపాద శ్రీవల్లభ అనఘా దత్త క్షేత్ర వార్షికోత్సవాల్లో పాల్గొన్న ఆయన మంగళవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పాదగయ రాగసాగర కచేరీలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆధ్యాత్మికతత్వంతో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత చేకూరుతుందని చెప్పారు. ఆధ్యాత్మిక జీవన విధానం ప్రతి మనిషికీ ఎంతో అవసరమన్నారు. క్షేత్రంలో వేంచేసిన శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారికి మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అనఘా దత్త క్షేత్రంలో గురువారం వరకూ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన పెంచాలి



గిరిజన జిల్లాల అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న రామనాథం

సామర్లకోట: పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ (పెసా) చట్టంపై గిరిజనులకు అవగాహన కల్పించి, వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్ (ఏపీఎస్ఐఆర్‌డీ, పీఆర్) డిప్యూటీ డైరెక్టర్ రామనాథం అన్నారు. గిరిజన చట్టాలపై శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు జిల్లాల్లోని అధికారులకు రెండో బ్యాచ్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించారు. స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆయా జిల్లాల్లోని ఎంపీడీఓలకు, ఈఓ పీఆర్‌డీలకు, నలుగురు పంచాయతీ కార్యదర్శులకు ఎంటటీలుగా శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ పొందిన అధికారులు ఆయా మండలాల్లోని గిరిజన ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ప్రజలకు పెసా చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ మాట్లాడుతూ, గిరిజనుల కోసం రాజ్యాంగంలో కొన్ని ప్రత్యేక ప్రయోజనకర నిబంధనలు పొందుపరిచారని చెప్పారు. గిరిజనులు ఎటువంటి శ్రమ దోపిడీకి గురవకుండా చూడాలన్నారు. వారి అభివృద్ధికి ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ శాఖ ద్వారా వారికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, ఏపీఎస్ఐఆర్‌డీ, పీఆర్ జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

చొల్లంగి తీర్థానికి అన్ని ఏర్పాట్లూ చేయాలి



చొల్లంగి తీర్థం ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎంపీడీఓ అనుపమ

కరప: ఉప్పలంక శివారు మొండి వద్ద ఈ నెల 29న జరిగే చొల్లంగి తీర్థానికి అన్ని ఏర్పాట్లూ చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఎంపీడీఓ ఎం.అనుపమ సూచించారు. చొల్లంగి తీర్థం నిర్వహణపై రెవెన్యూ, దేవదాయ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె సమీక్షించారు. ఆ రోజు తెల్లవారుజాము నుంచే పుణ్యస్నానాలకు, సంగమేశ్వరస్వామి దర్శనాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణతో పాటు మంచినీరు, వైద్య శిబిరం, బందోబస్తు తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. గ్రామాల నుంచి స్నానాల రేవుకు మధ్యాహ్నం 12 గంటల తర్వాత అప్పన్న ఎద్దులను తీసుకుని వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఎస్ఎన్ చారిటీస్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ, భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శనానికి వీవీఐపీ, వీఐపీ, సర్వదర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్నానాల రేవు వద్ద గజ ఈతగాళ్లను ఉంచుతామని, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కరప ఎస్సై టి.సునీత మాట్లాడుతూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, స్నానాల రేవు వద్ద, దర్శనాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాకినాడ నుంచి యానాం వైపు వెళ్లే వాహనాలను 28వ తేదీ అర్ధరాత్రి నుంచి అన్నమ్మ ఘాటీ, తూరంగి, నడకుదురు మీదుగా గురజనాపల్లి నుంచి యానాం రోడ్డుకు వెళ్లేలా మళ్లిస్తామని వివరించారు. అలాగే, యానాం వైపు నుంచి కాకినాడ వచ్చే వాహనాలను పటవల, జి.వేమవరం, గొర్రిపూడి మీదుగా పెనుగుదురు నుంచి కాకినాడ వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీవీఎస్ వర్ధన్, పీహెచ్‌సీ వైద్యులు యాంజలిన్, ట్రాఫిక్ ఎస్సై బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై ప్రైవేటు కార్యక్రమం



సత్య శ్రీనివాస ఏసీ ఉచిత కల్యాణ మండపంలో జరిగిన ప్రైవేటు కార్యక్రమం

అన్నవరం: దేవాలయాల పవిత్రతను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరో.. లేక అధికారులకు సరైన అవగాహన లేనందువల్లనో కానీ.. అటు టీటీడీ నుంచి ఇటు చిన్న ఆలయాల వరకూ కొద్ది రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా పలు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా సత్యదేవుని సన్నిధిలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి అధికారులు అనుమతి ఇవ్వడంపై దుమారం రేగుతోంది. దేవస్థానంలోని సత్యగిరిపై పేదలు ఉచితంగా వివాహాలు చేసుకునేందుకు గాను పెద్దాపురానికి చెందిన దాత మట్టే శ్రీనివాస్ సత్య శ్రీనివాస ఉచిత ఏసీ కల్యాణ మండపం నిర్మించారు. ఇందులోని 12 మండపాల్లో ఒకే ముహూర్తానికి 12 వివాహాలు చేసుకునే అవకాశం ఉంది. మూడేళ్లుగా ఇక్కడ వందలాదిగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వధూవరులు వివాహాలు చేసుకున్నారు. వధూవరుల వయో ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులు, ఇరు వైపుల పెద్దల వివరాలు, వివాహ లగ్నపత్రిక జత చేస్తే తప్ప ఇక్కడ వివాహాలు చేసుకునే అవకాశం ఉండదు. అంత కట్టుదిట్టంగా అనుమతి ఇస్తారు. అలాగే, గతంలో దేవస్థానం వార్షిక కల్యాణానికి సంబంధించిన సమావేశాలు కూడా ఇక్కడ నిర్వహించారు. నిబంధనల ప్రకారం దేవస్థానంలోని ఉచిత కల్యాణ మండపాల్లో వివాహాలు లేదా ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే జరగాల్సి ఉంది. కానీ, ఈ కల్యాణ మండపంలో మంగళవారం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ కార్యక్రమానికి దాత అనుమతిచ్చినట్టు చెబుతున్నారు. అయితే దాతకు అవగాహన లేక అనుమతిచ్చినా.. దేవస్థానం అనుమతి నిరాకరిస్తే సరిపోయేది. కాని దేవస్థానం అధికారులు కూడా అనుమతి ఇవ్వడం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. దీనిపై ఈఓ వీర్ల సుబ్బారావును వివరణ కోరగా.. వాసవీ కన్యకాపరమేశ్వరి ట్రస్ట్ కార్యక్రమం అనే అభిప్రాయంతో అనుమతి ఇచ్చామని, వాసవీ క్లబ్ కార్యక్రమమనే విషయం తెలియదని చెప్పారు.

వచ్చే నెలలో 'ప్రసాద్' పనులు



క్యూ కాంప్లెక్స్ నిర్మించనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న టూరిజం, దేవస్థానం అధికారులు

అన్నవరం: కేంద్ర ప్రభుత్వ పిలిగ్రిమేజ్ రీజువినేషన్ అండ్ స్పిరిట్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీమ్ కింద రూ.20 కోట్లతో చేపట్టనున్న పనులు వచ్చే నెలలో ప్రారంభమయ్యే అవకాశముందని రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఆ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ వేంకటేష్, ఆర్కిటెక్ట్ టి.బాలకృష్ణ మంగళవారం రత్నగిరికి వచ్చి, ప్రసాద్ స్కీమ్ కింద వివిధ భవనాలు నిర్మించనున్న స్థలాలను పరిశీలించారు. వారికి దేవస్థానం ఈఈలు రామకృష్ణ, వి.నూకరత్నం, ఇతర అధికారులు ఆయా స్థలాలను చూపించి, వివరించారు. దేవస్థానంలోని పాత టీటీడీ భవనం స్థలంలో రూ.10 కోట్లతో రెండంతస్తుల్లో అన్నదాన భవనం నిర్మించనున్నారు. అలాగే, ప్రస్తుత అన్నదాన భవనం పక్కనే రూ.6 కోట్లతో క్యూ కాంప్లెక్స్, ప్రకాష్ సదన్ వెనుకన ఉన్న ప్రస్తుత పార్కింగ్ స్థలంలో అటు సత్యగిరికి, ఇటు రత్నగిరికి దగ్గరగా ఉండేలా రూ.3 కోట్లతో టాయిలెట్ బ్లాకులు నిర్మించనున్నారు. ఈ స్థలాలను పరిశీలించిన టూరిజం అధికారులు వాటి పొడవు, వెడల్పు నమోదు చేసుకున్నారు. ఈ నిర్మాణాలకు ఈ నెల 9న రూ.18.97 కోట్లకు ఒకే ప్యాకేజీగా రీ టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. ఈ నెల 24తో టెండర్ల దరఖాస్తు గడువు ముగియనుంది. నెలాఖరుకు టెండర్లు ఖరారు చేసి, వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తారని టూరిజం అధికారులు తెలిపారు. స్థలాల పరిశీలన అనంతరం వారు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.సుబ్బారావుతో సమావేశమై చర్చించారు. ప్రసాద్ నిర్మాణాలు ఇప్పటికే చాలా ఆలస్యమయ్యాయని, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో దేవస్థానం డీఈలు గుర్రాజు, బీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కాకినాడ సిటీ: యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల నిర్ణయం ప్రకారం 12వ పీఆర్‌సీని వెంటనే నియమించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపునకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని యూటీఎఫ్ నాయకులు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) జె.వెంకట్రావుకు యూటీఎఫ్ వినతిపత్రం సమర్పించారు. 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగు, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్ బకాయిలు ఇవ్వాలని కోరుతూ వచ్చే నెలలో యూటీఎఫ్ కార్యాచరణ ఉంటుందన్నారు. తుని నియోజకవర్గం ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు అందరికీ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవి చక్రవర్తి, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సూరిబాబు, ప్రధాన కార్యదర్శి కేవీవీ నగేష్, సహాధ్యక్షులు వీవీ రమణ, సహాధ్యక్షురాలు బి.నాగమణి, ట్రెజరర్ పీవీఎస్ గణేష్, జిల్లా కార్యదర్శులు టి.సీతారామయ్య, టి.రామలక్ష్మి, ఎ.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బిక్కిన



విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బిక్కిన విశ్వేశ్వరరావు ఎన్నికయ్యారు. స్థానిక దేవాలయం వీధిలోని పైడా కల్యాణ మండలంలో మంగళవారం జరిగిన సమావేశంలో విశ్వేశ్వరరావు పేరును మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎన్నికల పరిశీలకుడు పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. 1994లో బీజేపీలో చేరిన బిక్కిన పార్టీకి ఎనలేని సేవ చేశారని, విద్యార్థి పరిషత్ నాయకునిగా, ఆర్ఎస్ఎస్ సభ్యునిగా సేవలందించారని మాధవ్ చెప్పారు. బీజేపీ తరఫున కాకినాడ ఎంపీగా పోటీ చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారన్నారు. జిల్లాలోని 22 మంది పార్టీ మండల అధ్యక్షులు, 22 మంది ప్రతినిధులు జిల్లా అధ్యక్షుని ఎన్నికకు ఓట్లు వేశారని ఎన్నికల పరిశీలకులు కోడూరి లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా అధ్యక్ష పదవికి బిక్కిన విశ్వేశ్వరరావు, రంభాల వేంకటేశ్వరరావు, గండి కొండలరావు, మట్టా మంగరాజు పోటీ పడ్డారన్నారు. పార్టీలో అందరినీ కలుపుకొని వెళ్తానని నూతన అధ్యక్షుడు విశ్వేశ్వరరావు చెప్పారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్, యార్లగడ్డ రామ్‌కుమార్, కవికొండల భీమశంకర్, మాలకొండయ్య పాల్గొన్నారు.

కోనసీమ సొబగులు



మంచుదుప్పటిలో కొత్త అందాలు సంతరించుకుంటున్న కొబ్బరి చెట్లు, వరిచేలు (ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి వద్ద)



మైదానంపై మంచు.. తెరలు తెరలుగా...: (అంబాజీపేట ఉన్నత పాఠశాల మైదానంలో)

సాక్షి, అమలాపురం: అసలే కోనసీమ. పచ్చని పట్టుపరికిణీ కట్టినట్టు ఉంటుంది. ఈ అందం నిన్నటి మొన్నటి వరకు సాగిన సంక్రాంతి పండగకు కొత్త సొబగులు అద్దుకుంది. ఇప్పుడు మంచురూపంలో సరికొత్త అందాలు ఒలకబోస్తోంది. పచ్చని చేలు.. కొబ్బరి తోటలు.. కాలువలు.. గోదావరి నదీపాయలు.. వాటిపై కప్పుకున్న మంచుదుప్పటి మైమరిచిపోయే అందాలను కళ్ల ముందు సాక్షాత్కరిస్తోంది. గడిచిన రెండు రోజులుగా జిల్లాలో ప్రకృతి ప్రియులను ఉల్లాసపరిచే పొగమంచు సోయగాలు కనువిందు చేస్తున్నాయి. మంచు తుంపర్లు వరి, కొబ్బరి చెట్లు, పలు రకాల ఇతర వృక్షాల ఆకులపై ముత్యాలుగా కొలువై కనువిందు చేస్తున్నాయి. ఆకుల చివర ఉన్న మంచు బిందువులపై పడిన లేతభానుడి కిరణాలు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. చూసేందుకు రెండు కళ్లు చాలని ఈ ప్రకృతి అందాలను ఆస్వాదించాలంటే తెల్లవారు జామునే దుప్పటి తొలగించి లేవాల్సిందే!

క్లుప్తంగా

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్షలను బుధవారం నుంచి 30 వ తేదీ వరకూ పకడ్బందీగా నిర్వర్తించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జేఈఈ మెయిన్ -2025 పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనవరి 22, 23, 24, 28, 29, 30 తేదీలలో ఈ పరీక్షలను రాజమహేంద్రవరం లూథర్‌గిరి, రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో నిర్వహిస్తున్నామన్నారు.

పరీక్ష సమయాలు : మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఉదయం షిఫ్ట్ నకు ఉదయం 7గంటల నుంచి 8.30 వరకూ, మధ్యాహ్నం షిఫ్ట్‌నకు 1 గంట నుంచి 2.30 గంటల వరకు అనుమతిస్తామన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, వస్తువులను అనుమతించబోమన్నారు. పరీక్షా కేంద్రం ఆవరణలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక అధికారి టి.శ్రీనివాసరావు, సిటీ కో ఆర్డినేటర్ ఎ.రాజేంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ వి.శ్రీనివాసరావు, వేగేశ్వరపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి. శ్రీనివాస్, డీటి బీవీ కృష్ణశాస్త్రి, వర్ష జైన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి గుర్తింపు అభినందనీయం

కౌడా చైర్మన్ రామస్వామి



బహుమతులు అందజేస్తున్న కౌడా చైర్మన్ బాబు

పెద్దాపురం: జాతీయ స్థాయిలో పెద్దాపురం పట్టణానికి మంచి గుర్తింపు తీసుకురావడంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల కృషి అభినందనీయమని కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన 13వ జాతీయ చెస్ చాంపియన్ షిప్-2025 పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన చెస్ పోటీల ముగింపు వేడుకలకు బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ తుమ్మలబాబు మాట్లాడుతూ క్రీడాకారులు భవిష్యత్‌లో ఎంతో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మంచి స్థానాన్ని అధిరోహించాలన్నారు. ఏపీ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అడుసుమిల్లి సురేష్, చెస్ అసోసియేషన్ చైర్మన్ కేవీవీ శర్మ మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడలకు అవకాశం కల్పించిన విజయ్ ప్రకాష్ కృషి అభినందనీయమన్నారు. విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ అండర్-7 నుంచి అండర్-12 వరకు 12 విభాగాల్లో 28 రాష్ట్రాల నుంచి 1,200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ హెచ్ఓడీ అజిత్‌కుమార్ వర్మ, ఆర్ఎస్ఎస్ రామచంద్రరావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఏ.రవినాయుడు, ఏపీ అసోషియేషన్ సీఈఓ కాళ్ల జ్వాలాముఖి, చెస్ అసోసియేషన్ ఏపీ సెక్రటరీ కె.జగదీష్, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, పాఠశాల కో-ఆర్డినేటర్లు రామకృష్ణ పాల్గొన్నారు.

తగ్గనున్న టెన్షన్

- ఆరు సబ్జెక్టులు..ఏడు పేపర్లు
- ప్రతి సబ్జెక్టుకు 100 వంతున మార్కులు
- పరీక్షల్లో మార్పులతో పది విద్యార్థులకు ఊరట


పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

రాయవరం: పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం పలు మార్పులు చేపట్టింది. పదవ తరగతి పరీక్షలు అనగానే ఎక్కడ లేని హడావుడి ప్రారంభమవుతుంది. విద్యార్థులతో పాటుగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంటారు. పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులకు ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు విరామాన్ని కూడా ప్రకటించింది. పది పబ్లిక్ పరీక్షల్లో చేపట్టిన సంస్కరణలు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు కానున్నాయి. గతేడాది విద్యా సంవత్సరంలో మాదిరిగానే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఏడు పేపర్లుగా నిర్వహిస్తారు.

గతంలో ఇలా..

పదవ తరగతిలో కొన్నేళ్లపాటు 11 పేపర్లను నిర్వహించారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టుకు 50 మార్కుల వంతున రెండు పేపర్లు నిర్వహించేవారు. సైన్సులో ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టుకు 50 మార్కుల వంతున రెండు పేపర్లు ఉండేవి. ఒక్కో పరీక్షను ఒక్కో రోజు వంతున 11 రోజుల పాటు పరీక్షలు నిర్వహించేవారు. కరోనా ప్రభావంతో 2019-20, 2020-21 విద్యా సంవత్సరాల్లో పబ్లిక్ పరీక్షలను రద్దు చేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021-22 విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించగా, 11 పేపర్లను ఏడు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టులకు ఒక్కో పేపరుకు 100 మార్కులకు వంతున పరీక్ష నిర్వహించగా, ఫిజికల్ సైన్స్, బయాలజీ పేపర్లను ఒక్కో పేపరును 50 మార్కుల వంతున నిర్వహించారు.

ఈ ఏడాది పరీక్షలు ఇలా..

2022-23 విద్యా సంవత్సరంలో పది పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ఒక్కో సబ్జెక్టుకు 100 మార్కులకు పేపరు నిర్వహిస్తున్నారు. సైన్స్ సబ్జెక్టులో మాత్రం ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఒకే ప్రశ్నాపత్రం ఇచ్చారు. అయితే జవాబులు మాత్రం వేర్వేరు సమాధాన పత్రాల బుక్‌లెట్స్‌లో రాయాల్సి వచ్చేది. గత విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో పీఎస్, బయాలజీ జవాబు పత్రాలను సంబంధిత ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయడానికి వీలుగా ఇలా వేర్వేరు జవాబు పత్రాల్లో రాయించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి, పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొడుతుందని విద్యావేత్తలు భావిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించే పది పబ్లిక్ పరీక్షల్లో కూడా ఆరు సబ్జెక్టులకు ఏడు పరీక్షలుగా నిర్వహిస్తున్నారు.

మార్చి 17 నుంచి పది పబ్లిక్ పరీక్షలు

పదో తరగతి పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోషల్ పరీక్షను రంజాన్ పర్వదినాన్ని బట్టి మార్చి 31 లేదా ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహించే అవకాశముంటుంది. పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే విడుదల చేశారు. ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లు మాత్రమే ఉంటాయి. సైన్స్ సబ్జెక్టు తప్ప మిగిలిన అన్ని సబ్జెక్టులకు 100 మార్కులకు ఒకే రోజు పరీక్ష ఉంటుంది. ఫిజిక్స్, బయాలజీలకు ఒక్కో సబ్జెక్టుకు 50 మార్కులకు రెండు రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ఇవ్వడం వల్ల విద్యార్థులకు కొంత విశ్రాంతి లభిస్తుంది.

ఒత్తిడి తగ్గుతుంది



పది పబ్లిక్ పరీక్షల్లో ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లు ఉండడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది. ప్రస్తుతం నిర్వహించే 100 మార్కుల పేపరు మోడల్‌కు అనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

– బి.హనుమంతురావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్, అమలాపురం

అంచనా వేసేందుకు వీలవుతుంది



100 మార్కులకు ఒకటే పేపరు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో భయాందోళనలు తగ్గుతాయి. విద్యార్థుల అకడమిక్ స్థాయిని కచ్చితంగా అంచనా వేయడానికి వీలవుతుంది.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈవో, అమలాపురం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,500 – 16,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు

జగ్గంపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందిని జగ్గంపేట పోలీసులు అరెస్టు చేసి, మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. వీరిలో ఐదుగురికి రూ.పది వేల చొప్పున జరిమానా, ఒకరికి నాలుగు రోజులు, ముగ్గురికి మూడు రోజుల చొప్పున, నలుగురికి రెండు రోజుల చొప్పున న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పది మందికి రూ.800 చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

రైతు రాబడి పెంచే చర్య హర్షదాయకం

- కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ
- సీటీఆర్ఐలో ఘనంగా నిర్కా అవతరణ దినోత్సవం



ఐసీఏఆర్-నిర్కా లోగోను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైతులు ఆదాయం పెంచే దిశగా జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ(నిర్కా) రూపాంతరం చెందడం హర్షదాయకమని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం ఐసీఏఆర్-సీటీఆర్ఐ నుంచి ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏ(నిర్కా)(జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ)గా రూపాంతరం చెందిన సందర్భంగా ఐసీఏఆర్-నిర్కా అవతరణ దినోత్సవాన్ని సంస్థ ప్రాంగణంలో డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అధ్యక్షతన నిర్వహించారు.

వేడుకకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఐసీఏఆర్ – నిర్కా లోగో, ఐసీఏఆర్ – నిర్కా భవన సముదాయం పేరును, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నిర్కా వల్ల రైతులు భవిష్యత్తులో ఎంతో లబ్ధి పొందగలరన్నారు. సీటీఆర్ఐ పరిధిని పెంచుతూ పొగాకుతో పాటుపసుపు, మిరప, ఆముదం, అశ్వగంధ పంటలను చేర్చడం ఈ ప్రాంత రైతులకు ఉపయోగపడుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతుల ఆదాయం రెట్టింపు చేసే దిశగా, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను పెంచి, వ్యవసాయాన్ని వాణిజ్యంగా తీర్చిదిద్ది, దిగుమతులను తగ్గించుకోవాలని కృషి చేస్తున్నారన్నారు. ఐసీఏఆర్-నిర్కా డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ మాట్లాడుతూ ఐసీఏఆర్-సీటీఆర్ఐ నుంచి ఐసీఏఆర్-నిర్కాగా రూపాంతరం చెందవలసిన ఆవశ్యకత, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికా మొదలైన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేష్ ద్వారా వివరించారు. ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్(క్రాప్ సైన్సెస్) డాక్టర్ టీఆర్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుత వాణిజ్య పంటలలో వోలటైల్ పదార్థాలపై దృష్టి సారించి, పరిశోధనలు చేపట్టాలని సూచించారు. గుంటూరు టుబాకో బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ గత 77 ఏళ్లుగా పొగాకు పరిశోధనలో అగ్రగామిగా నిలిచిన ఐసీఏఆర్ – సీటీఆర్ఐ, ఐసీఏఆర్ – నిర్కాగా అవతరించినప్పటికీ ఇతర పంటలతో పాటు పొగాకులో తన పరిశోధనలు కొనసాగిస్తూ రైతులకు తన సేవలు కొనసాగిస్తుందని ఆశించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ సీటీఆర్ఐ ఏడు దశాబ్దాలుగా రైతు సేవలో కృషి చేసిందని అన్నారు. అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ ఐసీఏఆర్-నిర్కా పొగాకు, పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం పంటల వాణిజ్య అంశాలను దృష్టిలో పెట్టుకొని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ సాంకేతికలను ఉపయోగించుకొని రైతు ప్రయోజనార్థంగా పనిచేయాలన్నారు.

ఐసీఏఆర్-ఎన్.ఐ.ఆర్.సి.ఎ. అవతరణ దినోత్సవ సందర్భంగా అతిథుల చేతులమీదుగా రీడిఫినింగ్ రీసెర్చ్: ట్రాన్స్‌ఫార్మేషన్ ఫ్రం సీటీఆర్ఐ టు నిర్కా అనే సాంకేతిక ప్రచురణను విడుదల చేశారు. సంస్థ పూర్వపు డైరెక్టర్ (యాక్టింగ్) డాక్టర్ టీజేకే మూర్తి, క్రాప్ ప్రొడక్షన్ హెడ్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యు.శ్రీధర్, నాబార్డు డీజీఎం వై. సోమునాయుడు, రైతు ప్రతినిధులు గద్దె శేషగిరిరావు, పొగాకు బోర్డు మేనేజర్ దామోదర్, ఐటీసీ చీఫ్ మేనేజర్, డాక్టర్ బి.ఎస్.ఆర్. రెడ్డి ప్రసంగించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రైతులు, తమిళనాడు రాష్ట్ర అశ్వగంధ రైతులు, ఏపీసీఎంఎఫ్ ప్రకృతి వ్యవసాయ రైతులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, స్టేక్ హోల్డర్స్, కంపెనీ ప్రతినిధులు, ఐసీఏఆర్ సంస్థల శాస్త్రవేత్తలు, రాష్ట్ర వ్యవసాయ ఉద్యాన శాఖ పంటల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీనోమ్ ఎడిటింగ్ ప్రయోగశాల ప్రారంభం

ఐసీఏఆర్-నిర్కాలో నూతనంగా ఏర్పాటు చేసిన జీనోమ్ ఎడిటింగ్ ప్రయోగశాలను ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టి.ఆర్.శర్మ ప్రారంభించారు. గ్రీన్‌హౌస్‌లోని జీనోమ్ ఎడిటింగ్ ద్వారా ఉద్భవించిన పొగాకు మొక్కలను పరిశీలించారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.సుమన్‌కళ్యాణి ఉత్పత్తుల గురించి వివరించారు.

బాలుడిపై బ్లేడుతో దాడి

ముమ్మిడివరం: పదో తరగతి చదువుతున్న బాలికను వేధింపులకు గురి చేస్తున్నాడన్న నెపంతో ఓ బాలుడిపై బాలిక తండ్రి బ్లేడుతో దాడి చేయగా పలుచోట్ల గాయాలయ్యాయి. ముమ్మిడివరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముమ్మిడివరం బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఓ బాలికను ముమ్మిడివరం బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బాలుడు తరచూ వేధింపులకు గురి చేస్తున్నాడని బాలిక తండ్రి పలు సార్లు బాలుడి కుటుంబ సభ్యులకు చెప్పి బాలుడిని హెచ్చరించారు. అయితే ఆ బాలుడు మంగళవారం సాయంత్రం స్థానిక బేకరి వద్ద స్నాక్స్ కొనుగోలు చేస్తుండగా ఆ బాలిక తండ్రి వచ్చి బ్లేడుతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడని బాలుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాయాలైన ఆ బాలుడిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ జీబీ స్వామి తెలిపారు. దాడి చేసిన వ్యక్తి పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది.

19.265 కేజీల గంజాయితో నిందితుడి అరెస్టు


నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై రాచపల్లి అడ్డరోడ్డు జంక్షన్ వద్ద 19.265 కేజీల గంజాయితో ఒకరిని స్థానిక ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి శివప్రసాద్ కథనం మేరకు అల్లూరి జిల్లా రాజఒమ్మంగి గ్రామానికి చెందిన తరుం వెంకటేశ్వరరావు గంజాయి వ్యాపారం చేసేవాడు. అయితే కొంతకాలంగా శంఖవరం మండలం సిద్దువారిపాలెం గ్రామంలో పంట పొలాలకు కాపలాదారునిగా పనిచేస్తున్నాడు. 19.265 కేజీల గంజాయిని ఆటోలో ఏజెన్సీ ప్రాంతం నుంచి రప్పించుకుని, రవాణా చేసేందుకు రాచపల్లి అడ్డురోడ్డు వద్ద వేచిఉన్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ సీఐ పి శివప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని, తరుం వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి కాటం భాను రిమాండ్ విధించారు.

దాడి చేసిన యువకులపై కేసు నమోదు

అమలాపురం టౌన్: దళిత యువకుడైన ఏసీ మెకానిక్ గంటి కిరణ్‌పై దాడి చేసిన ముగ్గురు ఇంటర్మీడియెట్ విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. గాయపడ్డ ఏసీ మెకానిక్ కిరణ్‌ను పరామర్శించిన మాజీ ఎంపీ హర్షకుమార్‌తో పాటు జిల్లా దళిత ఐక్య వేదిక నాయకులు, పలు దళిత సంఘాల ప్రతినిధులు దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేయాల్సిందేనని డిమాండ్ చేసిన క్రమంలో పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. దాడి చేసిన ముగ్గురు యువకులు మైనర్లు కావడంతో వారిపై కేసు నమోదు చేసి జువైనల్ కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌పీసీఐ లింకేజీలో ఫస్ట్


పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు

రాయవరం: నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) పోస్టల్ ఖాతాలు ఉన్నవారికి అన్ని సంక్షేమ పథకాలను అందించడంలో రాజమహేంద్రవరం డివిజన్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. రాయవరం బ్రాంచి పోస్టాఫీసును ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2018 సెప్టెంబర్ 1న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు నేరుగా అందాలన్న లక్ష్యంతో ఎన్‌పీసీఐ ఖాతాలతో అనుసంధానం చేశారన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 301 తపాలా శాఖల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం, రంపచోడవరంలో ఏటీఎం సేవలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. 307 బ్రాంచ్ పోస్టాఫీ సుల ద్వారా పొదుపు ఖాతాలు, ఆర్డీ, టెర్మ్ డిపాజిట్లు, మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్స్, సీనియర్ సిటిజన్, కిసాన్ వికాస్ పత్రాలు, నేషనల్ సేవింగ్స్ స్కీమ్, సుకన్య సమృద్ధి సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు.

రూ.50 కోట్ల ప్రీమియం లక్ష్యం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో రూ.50 కోట్ల ప్రీమియంను రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయడం లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. ఇప్పటి వరకు 90 శాతం లక్ష్యాన్ని అధిగమించగా, రానున్న రెండు నెలల్లో మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ కార్యాలయంలో రోజుకు 70 నుంచి 80 మంది వరకు పాస్‌పోర్ట్ కోసం నూతనంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో 34 తపాలా కార్యాలయాల్లో శిక్షణ పొందిన ఉద్యోగుల ద్వారా ఆధార్ మార్పులు, చేర్పుల సేవలను తక్కువ ఫీజుతో అందిస్తున్నామన్నారు.

పాఠశాల విద్య బలోపేతం

రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు సూచన


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో పాఠశాల విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఫలవంతమయ్యే సూచనలతో ముందుకు రావాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మానవ వనరుల అధికారులు, హెచ్ఎంలతో ఆనం కళాకేంద్రంలో మంగళవారం నూతన విద్యా విధానంపై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌కి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, కాకినాడ జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ కేతనగార్గ్, పాఠశాల విద్య ప్రాంతీయ ఆర్జేడీ జి.నాగమణి ఉభయగోదావరి జిల్లాల విద్యాశాఖాధికారులు హాజరయ్యారు. విజయరామరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా మానవ వనరులు విభాగంలోని మేధావి వర్గంతో శిక్షణ కార్యక్రమాలను చేపట్టామన్నారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలలో 6, 7, 8 తరగతి విద్యార్థులు ఉన్నచోట వారి సంఖ్యను బట్టి ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాల తప్పనిసరిగా వుండాలన్నారు. నూతన ప్రతిపాదిత విధానంలో విద్యార్థుల సంఖ్యను బట్టి శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, హైస్కూల్‌గా పాఠశాలల ఉన్నతీకరణ చేయడానికి జిల్లాలో క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఒక్కో క్లస్టర్ పరిధిలో 15 నుంచి 25 పాఠశాలలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీటిలో చేపట్టాల్సిన మార్పులు, చేర్పులపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు క్లస్టర్ మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. వారి అభిప్రాయాలను సమీకరించి ఒక సమగ్ర అధ్యయన నివేదిక రూపొందించనున్నామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులో మోడల్ ప్రాథమిక పాఠశాలను గుర్తించడానికి పాఠశాలల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు, క్లస్టర్ స్థాయి, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా పాఠశాల సామర్థ్యం, సహజ సంప్రదింపుల సమగ్ర అధ్యయనం ఆధారంగా గుర్తింపు ప్రక్రియ జరగాలన్నారు. దీనిలో జిల్లా పాఠశాల విద్యాధికారి, డిప్యూటీ, మండల విద్యా అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఇతర అనుబంధ శాఖల అధికారుల అభిప్రాయాలను సమీకరించనున్నామన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాల్య సంరక్షణ విద్య సజావుగా ఉండేలా, ఉమ్మడి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలతో అనుసంధానించడం, సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలను మార్చడం ద్వారా ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టడం, ఆ మేరకు సూచనలు సలహాలు స్వీకరిస్తామన్నారు.

గేదెల్లంక ఉత్తర వాహిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తా

మంత్రి దుర్గేష్


గేదెల్లంక ఉత్తరవాహిని ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే సుబ్బరాజు తదితరులు

ముమ్మిడివరం: మండలంలోని గేదెల్లంక ఉత్తరవాహిని ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం గేదెల్లంక ఉత్తర వాహిని పుష్కరాల రేవు ప్రాంతాన్ని మంగళవారం ముమ్మిడివరం, పెద్దాపురం ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, నిమ్మకాలయ చిన రాజప్పలతో కలిసి ఆయన పరిశీలించారు. గోదావరి నది మూడు పాయలు గేదెల్లంక వద్ద ఉత్తరం వైపు ప్రవహించడంతో ఈ ప్రాంతం త్రివేణి సంగమంగా విశిష్టత పొందిందన్నారు. పబ్లిక్, ప్రయివేటు భాగస్వామ్యంతో పిలిగ్రిం టూరిజం, ఎకో టూరిజం తోపాటు వాటర్‌స్పోర్ట్స్ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన దుర్గాప్రసాద్

కరప: తాగిన మత్తులో కొబ్బరిచెట్టు ఎక్కి, జారి పడిన ఘటనలో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఒక యువకుడు మృతిచెందాడు. కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన మాకిరెడ్డి దుర్గాప్రసాద్(23) కాకినాడ పోర్టులో కూలీగా పనిచేస్తుంటాడు. దుర్గాప్రసాద్ తన స్నేహితులతో కలసి ఈ నెల 10వ తేదీన గ్రామంలోని ఒక లేఅవుట్‌లో మద్యం సేవించాడు. తర్వాత అతని స్నేహితులు వెళ్లిపోగా ఒక స్నేహితుడు అశోక్‌కుమార్‌తో కలసి రాత్రి 11.30 గంటల సమయంలో చలిమంట వేసుకున్నారు. దుర్గాప్రసాద్ తాగిన మత్తులో అక్కడే ఉన్న కొబ్బరిచెట్టు ఎక్కి రెండు కొబ్బరిబొండాలు తీసి, కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తూ కొబ్బరిచెట్టు పైనుంచి జారి కిందకు పడిపోయి, స్పృహ కోల్పోయాడు. వెంటనే అశోక్‌కుమార్ ఈ విషయాన్ని దుర్గాప్రసాద్ తల్లిదండ్రులకు తెలిపి, చికిత్సకోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటి నుంచి చికిత్సపొందుతూ అతను మృతిచెందాడు. మృతుడు తండ్రి అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.సునీత కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి


సందీప్ (ఫైల్)

అల్లవరం:మండలంలోని గోడి బాడవ గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు సిర్రా సందీప్ అమలాపురంలో కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం సందీప్‌కు ఆరోగ్యం బాగోకపోవడంతో తల్లిదండ్రులు దుర్గాప్రసాదు, శిరీష మోటారు సైకిల్‌పై తీసుకుని ఆస్పత్రికి వెళ్తుండగా గోడిలంక శ్మశాన వాటిక సమీపంలో కుక్క వేగంగా వస్తూ మోటారు సైకిల్‌కి అడ్డు పడింది. దీంతో మోటారు సైకిల్ అదుపుతప్పి ముగ్గురూ పడిపోయాడు. ఈ ఘటనలో సందీప్‌కు తీవ్ర గాయాలై ముక్కు, చెవుల నుంచి రక్తస్రావం కాగా, తల్లిదండ్రులకు స్వల్ప గాయాలయ్యాయి. సందీప్‌ను పేరూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఆస్పత్రికి చెందిన అంబులెన్స్‌లో కిమ్స్‌కి తరలించి సందీప్‌కు చికిత్స అందిస్తుండగా తుది శ్వాస విడిచాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు. సందీప్ మృతి పట్ల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

అల్లవరం: అమలాపురం మండలం ఏ.వేమవరం గ్రామానికి చెందిన లింగోలు వీర వెంకట సత్యనారాయణ (సతీష్) గోడితిప్ప వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని అల్లవరం పోలీసులు తెలిపారు. అతను చెప్పుల షాపులో సేల్స్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సతీష్ తండ్రి చిన్నప్పుడే మృతి చెందారని, ఆరు నెలల కిత్రం అనారోగ్యంతో తల్లి మృతి చెందడంతో ఒంటరి తనం భరించలేక సతీష్ ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. మంగళవారం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడిలంక నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీని పి.గన్నవరం తహసీల్దార్ పి.శ్రీపల్లవి మంగళవారం సీజ్ చేశారు. లంక నుంచి మట్టిలోడుతో వస్తున్న లారీని ఏటిగట్టుపై ఆమె పట్టుకున్నారు. సీజ్ చేసిన లారీని తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ ర్యాంపులకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేవన్నారు.